ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 24.4

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

మంగళవారం 30 జూలై 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	512.90 (136.6461)	77,289	29,261
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.20 (3.82)	636.79	565.92
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.504 (1.09)	138	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240



ఆయకట్టులో సాగు లేనట్టేనా?

- సాధారణ విస్తీర్ణం దాటని పంటల సాగు
- ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు
- అన్ని మండలాల్లోనూ సాధారణ వర్షపాతం
- చెరువుల్లోకి చేరని వరద

51,325ఎకరాల ఆయకట్టు రైతుల ఆశలపై నీళ్లు

వానాకాలంలో ఆశించినస్థాయిలో భారీ వర్షాలు లేవు. జిల్లావ్యాప్తంగా చిరుజల్లులతో పాటు ఓ మోస్తరు వర్షాలే కురిశాయి. అన్ని మండలాల్లోనూ సాధారణ వర్షపాతం నమోదైంది. గత ఏడాది జూలైలో భారీ వర్షాలతో చెరువులన్నీ కళకళలాడగా, ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. చౌటుప్పల్, గుండాల మండలాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటల్లోకి ఆశించిన స్థాయిలో వరద చేరలేదు. ఫలితంగా రైతులకు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు.

- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

భారీ వర్షాలకు చెరువులు నిండితేనే ఆయకట్టులో పంటలు సాగవుతాయి. జిల్లాలో మొత్తం 1,080 చెరువులు ఉండగా, 10 చెరువులు మాత్రమే అలుగు పారగా, మిగతా చెరువుల్లోకి పెద్దగా నీరు చేరలేదు. దీంతో ఆయకట్టులో సాగుపై తీవ్ర ప్రభావం పడింది. జూలై నెలాఖరులోగా భారీ వర్షాలు లేకుంటే చెరువుల కింద భూములు సాగయ్యే అవకాశం లేదు. జిల్లా వ్యాప్తంగా సరిపడా వర్షాలు లేక వర్షాధార పంటల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. సాధారణ విస్తీర్ణం కూడా సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పంటలు సాగుచేస్తుండగా, వర్షాలు లేని చోట రైతులు సందిగ్ధంలో పడ్డారు. ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడా భారీగా వర్షాలు కురిసింది లేదు. విస్తారంగా వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలకు నీరు చేరుతుంది. అయితే జిల్లాలో ఓ మోస్తరు వర్షాలే కురవడంతో ఇప్పటి వరకు జలాశయాల్లోకి పెద్దగా వరద చేరలేదు. దీంతో పలుప్రాంతాల్లో ఆయకట్టు కింద పంటలు సాగు చేద్దామని ఎదురుచూస్తున్న రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. సీజన్ దాటుతున్నప్పటికీ వర్షాలు లేక ఆయకట్టు సాగుకు నోచుకోవడంలేదు. సాధారణంగా చెరువుల కింద వరి, తదితర పంటలు సాగవుతాయి. జిల్లాలో సాధారణంగా పంటల విస్తీర్ణం 4.20లక్షల ఎకరాలు కాగా, ప్రస్తుత సీజన్‌లో 2లక్షల ఎకరాల్లోనే పలు రకాల పంటలు సాగయ్యాయి. జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు, పత్తి, కూరగాయలు, పండ్లతోటలు సాగవుతాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఆరుతడి పంటలతో పాటు బోరుబావుల కింద సాగుచేసిన పంటలకు ఊరటనిచ్చాయి. ఇప్పుడిప్పుడే జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదవడంతో, ఆగస్టు మొదటివారంలో పంటల సాగు ఊపందుకుంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

తొమ్మిది మండలాల్లో వర్షపాతం లోటు

జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ సగటు వర్షపాతం 244.2మి.మీ కాగా, 233.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 11.1 మి.మీ వర్షపాతం లోటు ఏర్పడింది. ఇక జిల్లాలోని 17 మండలాలకు తొమ్మిది మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. గుండాల మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఇక్కడ. ఇక్కడ 72.80మి.మీ వర్షపాతం లోటు ఉంది. ఆ తరువాత చౌటుప్పల్‌లో 59.10మి.మీ వర్షపాతం లోటు ఏర్పడింది. ఒక్క భూదాన్‌పోచంపల్లిలో మాత్రమే పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉంది. ఇక్కడ 51.10మి.మీ వర్షం అదనంగా కురిసింది. ఏడు మండలాల్లో 15మి.మీ లోపు అదనపు వర్షపాతం నమోదైంది.

వానాకాలంలో జిల్లాలో సాధారణ సగటు వర్షపాతం 244.2మి.మీ.కు 233.1మి.మీ వర్షపాతం నమోదైంది.

మండలాల వారీగా వర్షపాతం ఇలా..

మండలం	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం	వర్షపాతం వ్యత్యాసం
గుండాల	273.9	201.1	-72.80
చౌటుప్పల్	212.3	153.2	-59.10
ఆత్మకూరు	236.2	198.3	-37.90
యాదగిరిగుట్ట	252.3	215.0	-37.30
అడ్డగూడూరు	276.3	241.4	-34.90
రాజపేట	236.1	205.1	-31.00
ఆలేరు	258.6	241.2	-17.40
బీబీనగర్	264.5	248.6	-15.90
నారాయణపూర్	166.6	154.6	-12.00
భువనగిరి	276.4	279.0	+02.60
మోటకొండూరు	252.3	257.4	+05.10
రామన్నపేట	236.3	248.0	+11.70
బొమ్మలరామారం	212.0	224.2	+12.20
మోత్కూరు	285.9	300.5	+14.60
వలిగొండ	249.8	264.9	+15.10
తుర్కపల్లి	218.6	233.8	+15.20
భూదాన్‌పోచంపల్లి	244.6	295.7	+51.10

చెరువుల కింద 51,325ఎకరాల ఆయకట్టు

జిల్లాలో మొత్తం 1,011 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల కింద 51,325 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో 100 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న చెరువులు 115 ఉండగా, ఈ చెరువుల కింద 23,805ఎకరాల ఆయకట్టు ఉంది. 100ఎకరాల విస్తీర్ణం కంటే తక్కువ ఉన్న చెరువులు 890 వరకు ఉన్నాయి. వీటి కింద 27,520 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటిలో ఆలేరు మండలంలో 3,372 ఎకరాలు, రాజపేటలో 3,226, బొమ్మలరామారంలో 4,151, తుర్కపల్లిలో 5,352, గుండాలలో 4,280, యాదగిరిగుట్టలో 3,034, ఆత్మకూరులో 2,808, మోటకొండూరులో 3,152, బీబీనగర్‌లో 5,114, పోచంపల్లిలో 6,845, వలిగొండలో 8,252, భువనగిరిలో 5,210 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో ఈసారి ఆయకట్టు సాగుకు నోచుకోని పరిస్థితి నెలకొంది. ఆరుతడి, వర్షాధార పంటలు వేసిన రైతులు భారీ వర్షాలకోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే కాయ దశ వరకు పంటలకు నీరు అందించాల్సి ఉంటుంది. పూత దశలో వర్షాలు కురుస్తాయా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆశించిన స్థాయిలో భూగర్భ జలమట్టం పెరగలేదు. దీంతో మూడు అంగుళాల వరకు నీరు పోసే బోరుబావులు అంగుళానికి పడిపోయాయి. ఇది పంటల సాగు పై తీవ్ర ప్రభావం చూపుతోంది. వారం రోజుల్లోగా భారీగా వర్షాలు కురిస్తేనే వానాకాలం ఆయకట్టు ముందుకు సాగే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా చెరువుల కింద ఉన్న పొలాల్లో రైతులు బోరుబావులు ఏర్పాటుచేసుకుంటున్నారు.

బిరబిరా కృష్ణమ్మ.. సాగర్‌కు

నల్లగొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/నాగార్జునసాగర్: ఆధునికదేవాలయం నాగార్జునసాగర్ క్రమక్రమంగా జలకళను సంతరించుకుంటోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6.50లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, రాష్ట్రానికి విద్యుత్‌ను అందించే నా గార్జునసాగర్ జలాశయానికి రెండేళ్ల తర్వాత వానాకాలంలో వరదపోటెత్తుతోంది. కృష్ణానదిపై ఎగువన ఉన్న ఆల్మట్టి,నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులతో పాటు తుంగభద్రపై ఉన్న హోస్పేట, సుంకేశుల నిండడంతో కృష్ణా, తుంగభద్ర నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌కు 3.26లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో శ్రీశైలం గేట్లను సోమవారం ఎత్తడంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వరద మొదలైంది.

కృష్ణానదిపై ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు సోమవారం ఎత్తడంతో మంగళవారం ఉదయానికి నాగార్జునసాగర్‌కు లక్ష క్యూసెక్కుల వరద చేరనుంది. మంగళ, బుధ, గురు వారాల్లో వరద మరింత పెరుగుతుందని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వారం, పది రోజుల్లో నాగార్జునసాగర్ నిండే అవకాశం ఉందని, ఈ వారంలోనే ఎడమ కాల్వలకు సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. బోరుబావుల ఆధారంగా ఇప్పటికే ఎడమ కాల్వ ఆయకట్టులో నారుమడులు చేసిన రైతులు, కాల్వకు నీరు విడుదల చేస్తే నాట్లకు సిద్ధమవుతున్నారు. కేఆర్ఎంబీ (కృష్ణా నది యాజమాన్య బోర్డు) ఆదేశాలు వచ్చిన వెంటనే నీటి విడుదలకు సాగర్ ప్రాజెక్టు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత ఏడాది క్రాప్ హాలిడే తర్వాత మళ్లీ సాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదలకు సన్నాహాలు చేస్తుండడం, జలాశయం నిండే పరిస్థితి ఉండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాగర్‌కు తరలివస్తున్న వరద

శ్రీశైలం జలాశయ నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువలో ఉండటం, ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు, పవర్‌హౌస్‌ల ద్వారా దిగువకు సోమవారం సాయంత్రం 1,39,194 క్యూసెక్కుల చొప్పున ప్రాజెక్ట్ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు ఇప్పటికే 77వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, ఈ వరద తోడైతే మంగళవారం ఉదయానికి 1.40లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రానుంది. వరద మరింత పెరుగుతుందని ప్రాజెక్ట్ అధికారులు అంచనా వేస్తున్నారు. నాగార్జునసాగర్ నీటిమట్టం 512.90 అడుగుల (136.64టీఎంసీలు) నీరు చేరింది. ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే రెండు రోజుల్లో నీటిమట్టం 550 అడుగులకు చేరనుంది.



శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు



రెండో విడత రుణమాఫీ రూ.165.87కోట్లు

- 16,143మంది రైతులకు ప్రయోజనం
- తొలి విడతలో 36,483 మంది రైతుల రుణాలు మాఫీ

యాదాద్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు వివిధ బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రెండో విడత రుణమాఫీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రెండో దఫా రూ.1.50లక్షల వరకు రుణాలు మాఫీకానున్నాయి. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. మంగళవారం ఈ రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జిల్లాలోని 17 మండలాల్లో రూ.1.50లక్షల మేర రుణాలు తీసుకున్న రైతులు మొత్తం 16,143మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చాక రైతులు పంట రుణాలు రూ.2లక్షల వరకు మాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ మేరకు మూడు విడతల్లో రుణమాఫీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతోపాటు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రతి రైతు కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుంది. అయితే ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే వర్తిస్తుంది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల రుణాలు మాఫీకానున్నాయి. 2018 డిసెంబరు 12వ తేదీన మంజూరైన, రెన్యూవల్ అయిన రుణాలకు, 2023 డిసెంబరు 9వ తేదీ నాటికి బకాయి ఉన్న పంటరుణాలు మాత్రమే మాఫీ అవుతాయి. ఈ పథకంపై రైతుల సందేహాలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేకంగా పరిష్కార విభాగాన్ని ఏర్పాటుచేసింది. రైతులు వారి ఇబ్బందులను ఐటీ పోర్టల్ ద్వారా, మండల స్థాయిలో ఉన్న సహాయ కేంద్రాల ద్వారా వివరించవచ్చు. రైతుల అభ్యర్థనను 30రోజుల లోపు పరిష్కరిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి కె.అనురాధ తెలిపారు.

రెండోదఫాలో రూ.165.87కోట్ల రుణమాఫీ

జిల్లాలో రెండోవిడత రుణమాఫీలో 16,143మంది రైతులకు సంబంధించిన రూ.165,87,29,511 మాఫీ కానున్నాయి.

మండలం	రైతులు	మాఫీ (రూపాయల్లో)
అడ్డగూడూరు	266	2,87,82,461
ఆలేరు	709	72,21,22,503
ఆత్మకూరు(ఎం)	453	4,52,11,885
భువనగిరి	935	9,63,69,120
బీబీనగర్	617	6,20,22,209
బొమ్మలరామారం	775	7,64,51,724
చౌటుప్పల్	1,693	17,72,65,305
గుండాల	930	9,58,56,759
మోటకొండూరు	913	8,29,50,041
మోత్కూరు	1,142	12,29,30,015
నారాయణపూర్	999	10,13,89,622
పోచంపల్లి	900	9,87,65,768
రాజపేట	843	8,93,74,674
రామన్నపేట	1,224	12,39,17,732
తుర్కపల్లి	1,058	11,38,40,792
వలిగొండ	1,675	16,97,62,050
యాదగిరిగుట్ట	676	6,67,76,238
ఇతరులు	335	3,38,50,613

మొదటి దఫాలో 36,483 మంది రైతులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంట రుణమాఫీ కింద జిల్లాలోని 17 మండలాల్లో రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్న 36,483మంది రైతుల రుణాలు మాఫీ అయ్యాయి. వీరిలో అడ్డగూడూరు మండలంలో 1,733 మంది రైతులు, ఆలేరులో 1,878మంది, ఆత్మకూరు(ఎం)లో 2,109, భూదాన్‌పోచంపల్లిలో 2,286, భువనగిరిలో 1,964, బీబీనగర్‌లో 1,650, బొమ్మలరామారంలో 2,012, చౌటుప్పల్‌లో 1,982, గుండాలలో 2,223, మోటకొండూరులో 1,797, మోత్కూరులో 1,357, నారాయణపూర్‌లో 3,008, రాజపేటలో 2,325, రామన్నపేటలో 2,744, తుర్కపల్లిలో 2,419, వలిగొండలో 3,315, యాదగిరిగుట్టలో 1,681మంది రైతుల రుణాలు మాఫీ అయ్యాయి.

విద్యతోనే సామాజిక అసమానతలు దూరం

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



బలరాం సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చౌటుప్పల్ టౌన్, జూలై 29: విద్యతోనే సామాజిక అసమానతలు తొలగి దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో సోమవారం జరిగిన యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లబెల్లి బలరాం సంస్మరణలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానంలో సమూల మార్పులు రావల్సి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న నాణ్యమైన ఉచిత విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో విద్యకు ప్రాధాన్యం ఉందన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిర్యాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, నాయకులు పి.కృష్ణమూర్తి, రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, యాకయ్య, దోనూరు బుచ్చిరెడ్డి, అవ్వారు గోవర్ధన్, ఉపేందర్ రెడ్డి, అంజిరెడ్డి, వెంకట రమణారెడ్డి, తిరుమలయ్య పాల్గొన్నారు.

ఇన్నోవేటర్ ఆవిష్కర్తలు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి అర్బన్, జూలై 29: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఆగస్టు 3వ తేదీలోగా ఆవిష్కర్తలు దరఖాస్తు చేసుకోవాలని ఇన్నోవేషన్ కో- ఆర్డినేటర్ వడ్డేపల్లి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణుల కోసం ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరికొత్త ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తూ, ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024 సంవత్సరానికి సంబంధించి ఎడిషన్ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణులు వినూత్నమైన ఆలోచనలు ప్రాజెక్టుల సమర్పణకు సిద్ధం కావాలని, ఆగస్టు 15వ తేదీన అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సరికొత్తగా ప్రతి జిల్లాకు ఒకరి చొప్పున 33మంది యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను వాట్సాప్ నంబరు 9100678543కు సందేశం పంపాలని కోరారు. పేరు, వయసు, ఫొటో, వృత్తి, గ్రామం, మండలంతో పాటు ఆవిష్కరణ పేరు 100పదాలకు మించకుండా వివరణ పొందుపర్చి అందుకు సంబంధించిన నాలుగు ఫొటోలు (హైరిజల్యూషన్), ఆవిష్కరణ పనితీరును ప్రదర్శించే రెండు వీడియోలు, అవసరమైన ఇతర వివరాలు పంపాలని కోరారు. మరింత సమాచారం కోసం సెల్ : 8555802433లో సంప్రందించాలని కోరారు.

అధ్యయనాలతో మెరుగైన సేవలు

డీఆర్డీవో ఎంఏ. కృష్ణన్

భువనగిరి అర్బన్, జూలై 29: గ్రామీణ స్థాయి నుంచి ప్రవేశపెట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధ్యయనాలు తోడ్పడతాయని డీఆర్డీవో ఎంఏ. కృష్ణన్ అన్నారు. సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్‌కు చెందిన 24 మంది అసిస్టెంట్ సెక్షన్ అధికారులకు గ్రామ సందర్శనలో భాగంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాలపై కలెక్టరేట్‌లో సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గ్రామీణలకు మరింత చేరువగా, వేగంగా అభివృద్ధి, అమలుకు ఇలాంటి అధ్యయనాలు ఉపకరిస్తాయన్నారు. ఈ నెల 29 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఐదు రోజుల పాటు యాదగిరిగుట్ట మండలం మల్లాపురం, తుర్కపల్లి మండలం ధర్మారం, రాజపేట మండలం దూదీవెంకటాపురం, మోటకొండూర్ మండలం వర్టూరు, రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామాలకు సంబంధించి గ్రామానికి ఐదుగురు సభ్యులు, సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ అధికారులు ఐదు రోజుల పాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తారని తెలిపారు. గ్రామపంచాయతీ, పౌర కేంద్రీకృత విలువలు పెంపొందించడంపై, సామాజిక, గ్రామీణ సమాజ గతిశీలను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడం, సాధారణ వ్యాధులు విశ్లేషించేందుకు, వాటిపై గ్రామస్థులు అవగాహన చేపట్టడం ఇందులో భాగమేనన్నారు.



కలెక్టరేట్‌లో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో ఎం.ఏ.కృష్ణన్

ఆచరణాత్మక దృశ్యాల్లో సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని వర్తింపజేసేందుకు కావాల్సిన వనరులపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ పాలనపై సమగ్ర దృక్పథాన్ని పెంపొందించడం, కలుపుగోలుతనం, సుస్థిరత, సమాజ భాగస్వామ్య సూత్రాలపై ఆచరణ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలు, భూమిలేని కూలీలకు సంబంధించిన సమస్యలను అధ్యయనం ద్వారా సులువుగా గుర్తించడం సాధ్యమన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించడం, సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్య స్థాయిని గుర్తించి వివరించేందుకు దోహదపడుతుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వేతర సంస్థల కార్యాచరణ ఫలితంగా ప్రజల జీవన నాణ్యత పరంగా గ్రామాల్లో సంభవించిన మార్పులను విశ్లేషించడం ఈ అధ్యయన ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రతినిధి పి.వెంకటేశ్వర్లు, భూగర్భ జల శాఖ అధికారి జ్యోతికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్, ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, సహకార శాఖ అధికారి ప్రవీణ్, అదనపు డీఆర్డీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం సర్వే

రాజాపేట : మండలంలోని దూది వెంకటాపూర్ గ్రామంలో కేంద్ర బృందం సభ్యులు సోమవారం సర్వే నిర్వహించారు. వ్యవసాయం, విద్యుత్, గ్రామీణ జీవన విధాన , ఆర్థిక పరిపుష్టి తదితర అంశాలపై గ్రామస్థులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదు రోజుల పాటు సర్వే నిర్వహించనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్, కుమార్, కుల్‌దీప్, మోహన్ వికాసరామ్, అమ్‌ద్ గుప్తా, ఎంపీడీవో నాగవేణి, తదితరులు ఉన్నారు.

ఆలయ ఉద్యోగుల్లో బదిలీల ఉత్కంఠ

భువనగిరి అర్బన్, జూలై 29: బదిలీల ప్రక్రియ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉద్యోగుల్లో ఉత్కంఠ రేపుతోంది. ముందస్తుగా ప్రకటించినట్లుగానే ఈ నెల 29వ తేదీ వరకు కమిషనర్ కార్యాలయం నుంచి బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడుతాయని అంతా భావించారు. ఈ నెల 27నే ఈ ప్రక్రియ పూర్తి అయి ఉత్తర్వులు జారీ తరువాయి అని ప్రచారం జరగగా, శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఉత్తర్వులు నిలిచిపోవచ్చని మరోలా ప్రచారం సాగింది. 40శాతం బదిలీల్లో ఆలయం నుంచి 25మంది వివిధ కేటగిరీల్లోని ఉద్యోగులు బదిలీ కానున్నారు. కానీ, వీరికి ఎట్టి పరిస్థితుల్లోనూ సోమవారం సాయంత్రం వరకు ఉత్తర్వులు అందుతాయని ఉద్యోగులు తర్జన భర్జన పడ్డారు. బదిలీలు తప్పవని భావించిన కొందరు ఉద్యోగులు బదిలీకి మానసికంగా సిద్ధం కాగా, రాష్ట్ర దేవాలయాల జేఏసీ చైర్మన్, నాయకుల పైరవీలతో రెండు రోజుల పాటు జాప్యం జరిగిందని భావించారు.

ఈ నెల 22వ తేదీన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ఆలయాల ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు ఆయన నివాసంలో కలిసి స్వామివారి లడ్డు ప్రసాదం అందజేసి బదిలీలు నిలిపివేయాలని కోరినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డిని సంప్రందించి న్యాయం జరిగే విధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. దీంతో బదిలీల పట్ల స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడే పుట్టి, పెరిగి, ఇక్కడే ఉద్యోగం పొంది, ఇక్కడే ఉద్యోగ విరమణ చేసిన దృష్ట్యా తప్పకుండా బదిలీ చేయాల్సిందేనని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ రెండో రోజుల క్రితం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఆధునిక సాగు కోసం 'రైతు నేస్తం'

- రైతువేదికల్లో ప్రతీ మంగళవారం నిర్వహణ
- రైతుల సందేహాలు, కొత్త వంగడాలు, ఆధునిక యంత్రాలపై అవగాహన పెంపు

•7లో..

హరిహరులకు విశేష పూజలు

ఆలయ ఖజానాకు రూ.18,74,858 ఆదాయం

•7లో..









ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

కట్టంగూరు, జూలై 29: ఆన్‌లైన్ మోసాలబారిన పడకుండా యువత జాగ్రత్త పడాలని కట్టంగూరు ఎస్ఐ ఎన్.శ్రీనివాస్ సూచించారు. సోమవారం కట్టంగూరు సెంటర్‌లో యువతకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీను మాట్లాడుతూ కట్టంగూరు పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా సరే గంజాయి విక్రయించినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.







విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

● పీఏపల్లి మండలం చిలకమర్రిలో ఘటన

పెద్దఅడిశర్లపల్లి, జూలై 29: విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం చిలకమర్రి గ్రామ పంచాయతీలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... కొండమల్లేపల్లికి చెందిన పర్వతం శివ (16) స్థానిక శ్రీకాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన మిత్రులతో కలిసి చిలకమర్రి సమీపంలో సంజీవని ఎడ్యుకేషన్ సొసైటీ దగ్గర గల ఫంక్షన్‌హాల్‌లో ఎలక్ట్రికల్ వర్క్‌కు సంబంధించిన పనికి వెళ్లాడు. అక్కడ పనులు నిర్వహిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. గమనించిన మిత్రులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. పేదరికం వల్ల కూలీ పనులకు వెళ్తూ కుటుంబ జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నామని, తమ కొడుకు చదువుకొని ఆసరాగా ఉంటాడనుకుంటే కళ్ల ముందు విగతజీవిగా మారాడని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.


శివ(ఫైల్ ఫొటో)

సినారె సాహిత్యం అద్భుతం

నల్లగొండ కల్చరల్, జూలై 29: జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యం అద్భుతమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సినారె రాసిన పాటలపై పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 22 మంది గాయనీ, గాయకులు పాల్గొని పాటలను అద్భుతంగా ఆలపించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన గాయకులను విజేతలుగా ప్రకటించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాదవాస్‌దేవ్ విజేతలైన మారోజు కేశవాచారికి ప్రథమ, తాదూరు రమేష్‌కు ద్వితీయ, మాచర్ల మహేశ్వర్‌కు తృతీయ బహుమతులు అందజేశారు. నాయకులు జెల్లా పుల్లయ్య, రమేష్, రవిప్రసాద్, ప్రకాష్, గోపాల్‌రెడ్డి, సుధాకర్, నీరజ, పద్మకుమారి, అలీ, రామలింగం, మోహన్‌రావు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సంఘం నాయకులు

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

శాలిగౌరారం, జూలై 29: తన ఇంటికి సమీపంలో ఉంటున్న మానసిక దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఈ సంఘటన జరిగింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ గ్రామానికి చెందిన దంపతులు కూలిపని చేస్తూ జీవనం సాగిస్తుండగా, వారికి మానసిక దివ్యాంగురాలైన(20) కుమార్తె ఉంది. వారి ఇంటికి సమీపంలో నివసించే దశరథ(50) తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బాధితురాలి ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించిన దశరథ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంతలోనే దివ్యాంగురాలి తల్లి ఇంటికి చేరుకోవడాన్ని గమనించి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి తల్లి సోమవారం శాలిగౌరారంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు. నిందితుడు దశరథను అదుపు లోకి తీసుకుని, బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం నల్లగొండకు తరలించారు. దశరథకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.









తైక్వాండోలో బంగారు పతకాలు



తైక్వాండోలో పతకాలు అందుకున్న నల్లగొండ జిల్లా క్రీడాకారులు

నల్లగొండ కల్చరల్, జూలై 29: హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర తైక్వాండో క్యాడెట్, జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండకు చెందిన తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. నాలుగు బంగారు, మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. వాల్కి శ్రేష్ఠ చంద్ర, గుండాల అక్షయ, జె.రేష్మగౌడ్, పి.సోహం బంగారు, అబ్దుల్ ముక్తిద్, ఎం. సౌమిత్ర, అబ్దుల్ ముహీత్ సిల్వర్, సదాశివ, షేక్ ఫిరోజ్, రాహుల్ బిట్టు, బి.యశ్వంతి, మహ్మద్ సులేమాన్ మాలిక్ కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టు 18 నుంచి 20వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ది తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు పి. విఠల్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.డీ. యూనుస్‌కమాల్, కోశాధికారి అంబటి ప్రణీత్ తదితరులు అభినందించారు.

కబడ్డీలో అజయ్ ఆల్‌రౌండ్ ప్రతిభ

● రైడర్, డిఫెండర్‌గా రాణింపు ● తెలుగు ప్రో కబడ్డీ లీగ్‌కు ఎంపిక



బీబీనగర్, జూలై 29: కబడ్డీపై ఆసక్తి పెంచుకున్న ఆ యువకుడు పట్టు విడవకుండా సాధన చేస్తూ ఆల్‌రౌండర్ ప్రతిభతో రాణిస్తున్నాడు. తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహించనున్న ప్రోకబడ్డీ లీగ్‌కు (టీపీకేఎల్)కు ఎంపికయ్యాడు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జంపల్లి గ్రామానికి చెందిన గొలనుకొండ విజయ్. గొలనుకొండ గోపాల్,సాలమ్మ దంపతులకు మొదటి సంతానం కూతురు కాగా, రెండో సంతానం అజయ్. తండ్రి గోపాల్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విజయ్ 12ఏళ్ల వయసులో ఉన్నప్పుడు తల్లి సాలమ్మ అనారోగ్యంతో చనిపోయింది. తల్లిదండ్రులను కోల్పోయిన అజయ్, అతని సోదరిని నాయనమ్మ అక్కున చేర్చుకుంది. గ్రామస్థుల సహకారంతో అజయ్‌ను భువనగిరిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. అక్కడే ఇంటర్ పూర్తిచేశాడు. 2021లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 2023లో ఏషియన్ స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ ఫిట్‌నెస్ బోర్డు ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఫేయిర్ ప్లే అవార్డు దక్కించుకున్నాడు. 2024మార్చి నెలలో పుల్లారెడ్డి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కూడా రైడర్, డిఫెండర్‌గా ఆల్‌రౌండర్‌గా అవార్డు అందుకున్నాడు. తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహించనున్న తెలుగు ప్రో కబడ్డీ లీగ్‌కు విజయ్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ ప్లేయర్‌గా శిక్షణ పొందుతున్నాడు.

సైబర్ చట్టాల సదస్సుకు వెంకటరమణరావు



నల్లగొండ క్రైం, జూలై 29: సైబర్ నేరాల చట్టాలపై అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నిర్వహించే సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్ కాన్ఫరెన్స్‌కు నల్లగొండ జిల్లాకు చెందిన సైబర్ నేరాల విశ్లేషకుడు, ఐక్యరాజ్య సమితి అకాడమిక్ కౌన్సిల్ సభ్యుడు ఆదోని వెంకటరమణరావు ఎంపికయ్యారు. అంతర్జాతీయ నేరాలపై చట్టాల గురించి సెప్టెంబరు 22,23వ తేదీల్లో నిర్వహించే కాన్ఫరెన్స్‌కు స్పెషల్ అక్రెడేషన్ ద్వారా ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయం వెంకటరమణరావుకు ఆహ్వానం పంపింది. సదస్సుకు ఎంపికైన ఆయనను నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఆధునిక సాగు కోసం 'రైతు నేస్తం'

● రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం
● రైతుల సందేహాలు, కొత్త వంగడాలు, ఆధునిక యంత్రాలపై అవగాహన పెంపు



భువనగిరి మండలం అనాజీపురం రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన రైతులు(ఫైల్)

భువనగిరి రూరల్, జూలై 29: వ్యవసాయ రంగంలో ఆధునిక పరిజ్ఞానం అన్నదాతలకు మరింత చేరవయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంటల సాగులో మెళకువలు, ఆధునిక పద్ధతులపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమానికి చేపట్టింది. మార్చి నెల నుంచి ప్రతీ మంగళవారం నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఓ రైతు వేదికలో మాత్రమే కొనసాగగా, ఇక నుంచి ప్రతీ రైతు వేదికలోనూ ఈ కార్యక్రమం కొనసాగేలా అధికారులు ఏర్పాట్లుచేశారు. రైతుల ముంగిటకు ఆధునిక విజ్ఞానాన్ని ప్రభుత్వం తీసుకువస్తుంది. ఇందుకోసం రైతు వేదికల్లో టీవీలు, కంప్యూటర్లు, మైకులు, ఇన్వర్టర్లు, నెట్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉన్నతాధికారులు నేరుగా రైతులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించడంతో పాటు సాగులో మెళకువలు, వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు,



వీడియో కాన్ఫరెన్స్ కోసం ఏర్పాటు చేసిన టీవీ, సీసీ కెమెరా

పంటల తెగుళ్ల నివారణ, చీడపీడల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు. ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, నూతన వంగడాలపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించేలా కార్యక్రమం రూపొందించారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై కూడా ఇందులో చర్చిస్తారు. రెండు రోజుల ముందే రైతు నేస్తంలో ఏ అంశంపై చర్చ ఉంటుందో జాబితా ప్రకటిస్తారు. ఈ అంశాలను వ్యవసాయ అధికారులు రైతులకు అందచేసి రైతులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా కార్యక్రమం రూపొందిస్తున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 చోట్ల

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించారు. అయితే జిల్లాలో 92 రైతు వేదికలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని 17 మండలాలలో 17 రైతువేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శ్రీకారంచుట్టారు. అందుకోసం అవసరమైన పరికరాలను కూడా సమకూర్చారు. భువనగిరి మండలంలో అనాజీపురం, బీబీనగర్ మండలంలో రాయరావుపేట, పోచంపల్లి మండలంలో బీమనపల్లి, వలిగొండ మండల కేంద్రంలో, రాజాపేట మండల కేంద్రంలో, ఆలేరు మండలంలో కొలనుపాక, ఆత్మకూర్ మండల కేంద్రంలో, తుర్కపల్లి మండలంలో మాదాపురం, యాదగిరిగుట్ట మండలంలో మాసాయిపేట, గుండాల మండల కేంద్రంలో, అడ్డగూడూరు మండల కేంద్రంలో, బొమ్మలరామారం మండల కేంద్రంలో, మోటకొండూరు మండలంలో చాడలో, మోత్కూరు మండలం పాటిమట్లలో, రామన్నపేట మండల కేంద్రంలో, నారాయణపూర్ మండల కేంద్రంలో, చౌటుప్పల్ మండలంలో జేకేసారం రైతు వేదికలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రైతులు హాజరై సలహాలు, సూచనలు పొందేలా స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రైతు నేస్తానికి అన్ని ఏర్పాట్లు చేశాం



ఆధునిక పరిజ్ఞానాన్ని అన్నదాతలకు చేరువ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని 17 మండలాలకు సంబంధించి ఒక్కో రైతువేదికను ఎంపిక చేసి రైతు నేస్తం నిర్వహణకు ఏర్పాట్లుచేశాం. ఆయా వేదికల్లో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. సాగులో రైతులకు మెళకువలు, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తాం. అదేవిధంగా శాస్త్రవేత్తలు, రాష్ట్రస్థాయి అధికారులు నేరుగా రైతులతో ముఖాముఖి కూడా చేపట్టేందుకు వీలు ఉంటుంది.

అనురాధ, జేడీఏ, యాదాద్రిభువనగిరి జిల్లా.

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, జూలై 29: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయన ఖజానాకు రూ. 18,74,858 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం!

చండూరు, జూలై 29 : వానా కాలం వ్యాధులు ప్రబలే కాలం. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలంటున్నారు. లేకుంటే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి జ్వరసంబంధిత ఇబ్బందులతో పాటు చికున్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కలుషిత నీటితో డయేరియా, టైఫాయిడ్, ఫ్లూ వంటి వ్యాధులు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



చండూరులో కుండీలో మురికి నీటిని తొలగిస్తున్న ఆరోగ్యసిబ్బంది

వైరల్ ఫీవర్ కారణాలు

వైరల్‌ఫీవర్ ఒకరి నుంచి ఒకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు వైరల్ ఫీవర్ విజృంభిస్తుంది.

లక్షణాలు

వైరల్‌ఫీవర్‌తో బాధపడేవారిలో జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం, ఒంటిపై దద్దుర్లు, వికారం, తల నొప్పి, ఆకలి మందగించడం, గొంతు నొప్పి, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

• ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. • మురుగు నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. • కాచి చల్లార్చిన నీటిని తాగాలి. • వేడివేడి ఆహారం తీసుకోవాలి. • తాజా పండ్లను తీసుకోవాలి. • దోమల తెరలను వాడాలి. • కిటికీలకు తెరలను ఏర్పాటుచేసుకోవాలి. • జ్వరం వచ్చిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. • బయట ఆహారం తీసుకోవద్దు. • ముఖ్యంగా పానీపూరీ, జంక్ ఫుడ్ తీసుకోకూడదు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వ్యాధులు సోకకుండా పరిశుభ్రంగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఆరోగ్య సూత్రాలను ఖచ్చితంగా పాటించాలి. వేడి ఆహారాన్ని తీసుకోవాలని. ఈగలు, దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే రోగాలు దరిచేరవు.

డాక్టర్ మాస రాజు, వైద్యాధికారి, చండూరు

శిథిలావస్థకు చేరిన రాజుల నాటి కట్టడం



షోకేస్



కూలేదశలో ఉన్న ఖిల్లాపై ఉన్న గోడ


కనుమరుగు కాకముందే..

కాపాడుకుందాం



చెక్కు చెదరని పురాతన కట్టడం





భువనగిరి ఖిల్లా

భువనగిరి ఖిల్లా స్థావరంగా పలువురు రాజులు ఈ ప్రాంతం నుంచి పాలన సాగించారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో భువనగిరి ఖిల్లా ఉంది. యాదగిరిగుట్ట, వరంగల్ వైపు వెళ్లే పర్యాటకులకు ఏకశిల కోటను ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా కనిపిస్తోంది. కొన్నేళ్లుగా పర్యాటకుల తాకిడి పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం భువనగిరి కోట అందాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. కేంద్ర, రాష్ట్రాల నుంచి అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ఖిల్లాను సందర్శించారు. అభివృద్ధి పనులను చేపడతామని ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించారు. కానీ అవి ఆచరణలో సాధ్యం కావడం లేదు. ప్రకటనలకు తప్ప పనులు చేయడం లేదు. ఖిల్లా పై సౌకర్యాలు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. చరిత్ర కనుమరుగు కాకుండా కోటను అందంగా తీర్చిదిద్దాల్సి ఉంది.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ యాదాద్రి



కంపచెట్లలో మూసుకుపోయిన మెట్ల మార్గం



కూలిన కోటపై కట్టిన రక్షణ గోడలు

విషపురుగులతో తస్మాత్ జాగ్రత్త



● వానాకాలంలో ఆరుబయటకు పాములు, తేళ్లు
● పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలం వచ్చిందంటే విషపురుగుల బెడద అధికంగా ఉంటుంది. పాములు, తేళ్లు, మండ్రగబ్బలు వాటి ఆవాసాల్లోకి నీరు చేరడం, చల్లటి వాతావరణం ఉండటంతో బయటకువచ్చి సమీప నివాసాలు, ఇతర ఆవాసాల్లోకి వస్తుంటాయి. వీటి బారిన పడి మనుషులతో పాటు మూగజీవాలు ప్రాణాలు కోల్పోతుంటారు. ప్రధానంగా పాములు, తేళ్లతో ఈ కాలంలో జాగ్రత్తగా ఉండాలి. పొలం పనులకు వెళ్లే అన్నదాతలతో పాటు కూలీలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

\- సూర్యాపేట టౌన్

కాటేసిన 20 నిమిషాల్లో..

పాము విషం క్షణాల్లో రక్తకణాల్లో కలుస్తుంది. నాగుపాము విషం కాటేసిన సుమారు 20 నిమిషాల్లోపే శరీరంలోకి ఎక్కుతుంది. రక్తపింజర విషం రెండు గంటల తర్వాత ప్రభావం చూపిస్తుంది. ఒక్కో పాము విషం తీవ్రతను బట్టి దాని ప్రభావం ఉంటుంది. పాము కాటేసిన వెంటనే ఆస్పత్రిలో చేరాలి. అదేవిధంగా తేలు, జెర్రిపోతు, నీరుకట్టు కాటేసినప్పటికీ విషం తక్కువగా ఉంటుంది. అయితే కాటేసిన చోట చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లడం తప్పనిసరి.

ఆందోళన చెందవద్దు

పాముకాటుకు గురైన వారు మొదటగా ఆందోళన చెందకుండా ఉండాలి. ఆందోళనకు గురైతే గుండెపోటుకు దారితీస్తుంది. పాముకాటుతో ఉన్న భాగం నుంచి శరీరంలోకి రక్తప్రసరణతో విషం వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ప్రాథమిక చర్యగా కాటు వేసిన ప్రదేశం పైభాగంలో గుడ్డతో బలంగా కట్టుకట్టాలి. ఆ వెంటనే చికిత్సకోసం ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఏపాము కాటేసిందో స్పష్టంగా వైద్యుడికి చెబితే దానికి సంబంధించిన చికిత్స అందిస్తారు.

విషసర్పాలు రెండు రకాలు

విషసర్పాలు రెండు రకాలు. ఒకటి న్యూరోటాక్సిన్ రకం నాగుపాము, కట్లపాము కాగా రెండో రకం హిమోటాక్సిన్ అనగా రక్తపింజర పాము. న్యూరోటాక్సిన్‌తో నోటి ద్వారా నురగ వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. హిమోటాక్సిన్‌తో రక్తనాళాలలో కణజాలం నశించి కాటుబడిన భాగంలో వాపు వస్తుంది. పక్కపక్కన రెండు దంతాలుగా కాటు వేస్తే అది కచ్చితంగా విషపాము అనుకోవాలి.

అందుబాటులో యాంటీ స్నేక్‌వీనమ్ ఇంజక్షన్లు

సూర్యాపేట జిల్లాలోని అన్నిస్థాయిల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 2023లో విషపురుగులు కరిచిన కేసులు 21దాకా నమోదుకాగా ఈ ఏడాది ఇప్పటివరకు రెండు కేసులు నమమోదయ్యాయి. అయితే ప్రాణాపాయం సంభవించలేదు.

పాము కరిస్తే లక్షణాలు

మనిషిని విషపూరితమైన పాము కరిస్తే శరీరం నీలం రంగులోకి మారుతుంది. రక్తపోటు తక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. కొందరిలో పొక్కులు, దద్దుర్లు కనిపిస్తాయి. నోటి నుంచి తెల్లని నురగ వస్తుంది. ఆయాస పడతారు. శరీరమంతా చెమటలు పట్టి కోమాలోకి వెళ్తారు. గుండె సాధారణ స్థాయి కన్నా రెట్టింపుగా కొట్టుకుంటుంది. ఆ క్షణంలో వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

'సకుర'లో రాష్ట్రస్థాయి పోటీలకు సాయిశ్రీ ఎంపిక



గరిడేపల్లి, జూలై 29: ఇండియా, జపాన్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం సకురలో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి మోడల్ కాలేజికి చెందిన నక్క సాయిశ్రీ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు గైడ్, జువాలజీ లెక్చరర్ పాటలీ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్యాపేటలోని బాల్ భవన్‌లో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షలో నక్క సాయిశ్రీ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలో సాయిశ్రీ పాల్గొననుందని తెలిపారు. సకురా ప్రోగ్రాంలో భాగంగా జపాన్‌లో మూడు వారాల పాటు నిర్వహించే ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కోసం ప్రతి రాష్ట్రం నుంచి ఐదు మంది విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. రాష్ట్ర స్థాయికి సాయిశ్రీ ఎంపిక కావడంపై కాలేజీ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

బందెల దొడ్లో ఉంచారు.. మేత వేయడం మరిచారు

●నీరసించి కుప్పకూలి చూడి ఆవు మృతి ● సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఘటన

హుజూర్‌నగర్, జూలై 29: బందెల దొడ్లో ఉంచిన ఆవుకు 10రోజులుగా మేత వేయనందున కుప్పకూలి మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మెయిన్ రోడ్లపై తిరుగుతున్న ఆవులను మునిసిపాలిటీ సిబ్బంది 10 రోజుల క్రితం బందెల దొడ్డికి తరలించారు. రైతులు ఆవులను తీసుకువెళ్లనందున మేత లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. బందెల దొడ్డిని ఆవులను మునిసిపల్ సిబ్బంది ఆదివారం సాయంత్రం వదిలిపెట్టారు. కాగా, పట్టణానికి చెందిన నరేష్‌కు చెందిన సూడి ఆవు 10రోజులుగా బందెల దొడ్లో ఉంది. మేత లేనందున తీవ్ర అస్వస్థతకు గురై ఇంటికి వెళ్లే క్రమంలో పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది. ఆవు కళేబరాన్ని మునిసిపాలిటీ అధికారులు ట్రాక్టర్ ఎక్కించి పట్టణంలోని డంపింగ్ యార్డుకు తరలించారు. ఆవు యజమాని నరేష్ మాట్లాడుతూ ఆవును బందెల దొడ్డికి తరలించిన అధికారులు, మేత వేయకుండా రోజుల తరబడి ఉంచినందున సుమారు రూ.60వేల విలువైన చూడి ఆవు మృతిచెందిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, జూలై 29: సూర్యాపేట జిల్లా కేంద్రంలో 10వ తరగతి విద్యార్థి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని నెహ్రూనగర్‌లో నివసించే రాజు-సంధ్య దంపతుల కుమారుడు అక్షిత్(15) పెన్‌పహాడ్ మండలంలోని అనాజిపురం శివారులోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు రెండు రోజులు (ఆది, సోమవారం) సెలవులు రావడంతో ఇంటికి వచ్చాడు. తండ్రి రాజు జిల్లా కేంద్రంలోని ఒక హోటల్‌లో పనిచేస్తుండగా, తల్లి సంధ్య ఏఎన్ఎంగా పనిచేస్తుంది. తల్లిదండ్రులు ఆదివారం విధులకు వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చే సరికి అక్షిత్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వగా పలువురు ఉపాధ్యాయులు సూర్యాపేటలో అక్షిత్ మృతదేహానికి నివాళులర్పించారు. అక్షిత్ మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

పర్సు దొంగిలించిన నిందితుడి అరెస్టు

నేరేడుచర్ల, జూలై 29: సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో మహిళ పర్సు కొట్టేసిన నిందితుడు సంపంగి రవి(28)ని పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలానికి చెందిన సంపంగి రవి ఈనెల 28న నేరేడుచర్లలో ఓ మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ఆమె సంచిలో నుంచి నుంచి పర్సు దొంగతనం చేసి పట్టుబడ్డాడు. దొంగిలించిన సొత్తును నిందితుడి నుంచి స్వాధీనం చేసుకుని, హుజూర్‌నగర్ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో11 కేసులు ఉన్నాయని, జైలుకు కూడా వెళ్లి వచ్చాడని ఎస్ఐ తెలిపారు.

రెడ్‌క్రాస్ భవనానికి స్థలం కేటాయించాలి

భువనగిరి రూరల్/ మోత్కూరు, జూలై 29: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు భువనగిరి కేంద్రంలో రెడ్ క్రాస్ కార్యాలయం, రెడ్ క్రాస్ భవనం బ్లడ్ బ్యాంక్ కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనరసింహారెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం హైదారాబాద్ అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు చాంబర్లో రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతి ప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ గత కలెక్టర్ తమకు జిల్లా కేంద్రంలో స్థలాన్ని చూపించారని, ఆర్డీవో సర్వే కూడా ఆయిందని, ప్రస్తుతం కలెక్టరేట్‌లో పెండింగ్ ఉందని, ఆ స్థలాన్ని తమకు కేటాయించాలని కోరారు. జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్త శిబిరాలు నిర్వహించడంలో రాష్ట్రంలోనే ఈ జిల్లా శాఖ ముందుందని, ఇప్పటికి జిల్లా కలెక్టర్‌కు రెండు సార్లు, జిల్లా చైర్మన్‌కు మూడు పర్యాయాలు గవర్నరు అవార్డులు లభించాయని తెలిపారు. తమ శాఖకు స్థలం కేటాయిస్తే రెడ్ క్రాస్ సొసైటీ అంతర్జాతీయ సంస్థ నుంచి బడ్ల్ బ్యాంక్ ఏర్పాటు కోసం రూ.కోటి నిధులు కేటాయిస్తుందని తెలిపారు. జిల్లాల్లో ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు అత్యవసరంగా రక్తం అవసరపడితే జిల్లా కేంద్రంలోనే బాధితులకు రక్తం లభించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితిలో హైదారాబాద్ లేదా నల్లగొండ వెళ్లాల్సి వస్తోందని వివరించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్‌కు భూమిని కేటాయించేందుకు వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి ఇప్పిస్తానన్ని హామీ ఇచ్చారు. రెడ్ క్రాస్ కార్యక్రమాలకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత అదనపు కలెక్టర్ రావుల మహేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సద్ది వెంకట్ రెడ్డి, జిల్లా కోశాధికారి అంజయ్య, జిల్లా డైరక్టర్లు కె.ప్రభాకర్‌రెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌కే.హమీద్, ఎస్.ఎన్.చారి, ఖలీల్, కే.నర్సిరెడ్డి, మత్యగిరి ఉన్నారు.



ప్రభుత్వ విప్ అయిలయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

భువనగిరి రూరల్: పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామి వారి అలంకరణ చేసి ప్రతి సోమవారం ప్రత్యేక పూజల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సోమేశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఆలయ కమిటీ అధ్యక్షుడు కాలేరు లక్ష్మణ్, నాగరాజు, కొల్లూరి రాజు పాల్గొన్నారు.

రాచకొండ ఆలయంలో..

సంస్థాన్‌నారాయణపురం : సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండలోని స్వయంభూ శంభులింగేశ్వర ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాచప్ప సమితి ఆధ్వర్యంలో చంద్రశేఖర ఆచారి భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్, కేశెట్టి దశరథ, రాజురెడ్డి, కమల్, పూజారి శరత్ చంద్ర, నల్లబోతు మారయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవాలి



దేశ్‌ముఖి గ్రామంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 29 : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు సామ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామంలో నాభిశిల, రేణుకా ఎల్లమ్మదేవి మునిరాజుల, భ్రమరాంభ మల్లికార్జున దేవాలయం మూడో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి సోమవారం వరకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాగా, మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో దేవాలయ కమిటీ అధ్యక్షుడు దుర్గం శంకర్‌యాదవ్, మాజీ సర్పంచు దుర్గం స్వప్న నరేష్, మాజీ ఎంపీటీసీ చిల్లర జంగయ్యయాదవ్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు భైరు ధనుంజయగౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం లింగస్వామియాదవ్, కోశాధికారి ఉప్పునూతల కృష్ణ, నాయకులు సూర సురేష్, జోగు వినోద్, జక్కుల రాము, దాసర్ల మశ్చేందర్, కన్నెమోని కుమార్ పాల్గొన్నారు.

రఘునాథపూర్ దర్గా నిర్వాహకుడి కన్నుమూత

రాజాపేట, జూలై 29: రాజాపేట మండలం రఘునాథపూర్ పాంచ్‌పీర్ దర్గా నిర్వాహకుడు బాబాసయ్యద్‌అలీషా అబ్దుల్ కుద్దూస్ చిస్తీఉల్ ఖాద్రి (54) సోమవారం హైదరాబాద్‌లోని బీజేఆర్‌ఆర్ నగర్‌లో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు రఘునాథపూర్ పాంచ్ పీర్ దర్గా వద్ద జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఖాద్రి (ఫైల్‌ఫొటో)

'అమరుల యాది చైతన్య యాత్రను విజయవంతం చేయాలి'

రామన్నపేట, జూలై 29: అమరుల యాది గీతన్నల చైతన్యయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు, జిల్లా నాయకుడు పులి భిక్షం గీత కార్మికులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 2 నుంచి 18 వరకు యాత్ర సాగుతుందని తెలిపారు. ఆగస్టు 2వ తేదీన బొలగాని పుల్లయ్య 36వ వర్ధంతి నుంచి 18వ తేదీన సర్వాయి పాపన్న 374 జయంతి వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహించి, అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలపాలని, బైక్ ర్యాలీలు, క్రీడలు ఆటల పోటీలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. పాటల పోటీలు, వ్యాసరచన పోటీలు రోగులకు పండ్లు పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలను పిలుపునిచ్చారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

భువనగిరి రూరల్, జూలై 29: మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాతపడింది. గ్రామంలోని రైతు పల్లెపాటి యాదగిరికి చెందిన పాడిగేదె గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతోనే గేదె మృతి చెందిందని బాధితుడు తెలిపాడు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జీవో 60ప్రకారం వేతనాలు చెల్లించాలి



భువనగిరిలో సమ్మెనుద్దేశించిమాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

భువనగిరి రూరల్, జూలై 29: భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2022 జూన్ నుంచి విడుదల చేసిన జీవో 60 ప్రకారం పెంచిన కొత్త వేతనాలను ఆసుపత్రి కార్మికులకు అమలు కాకపోవడం సరికాదన్నరు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఇమ్రాన్, నాయకులు పేరబోయిన మహేందర్, సామల శోభన్ బాబు, సామల భాస్కర్, లక్ష్మీ, వాణి, కమలమ్మ, సులోచన, నర్సింహ, నర్సయ్య, కృష్ణ, సుగుణ, రేణుక, శేఖర్ పాల్గొన్నారు.

గంధమల్ల రిజర్వాయర్ నిర్మించాలి

రాజాపేట: గంధమల్ల రిజర్వాయర్‌ను నిర్మించి తాగు, సాగునీటి కష్టాలను తీర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజాపేట మండల కేంద్రంలో సీపీఐ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని రైతులకు రుణమాఫీని ఏకకాలంలో అమలు చేయాలని, యాదాద్రి జిల్లాకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరి రాజయ్య, చిగుర్ల లింగం, మూల పోచయ్య, నర్సింహులు, బాల నర్సయ్య, రాములు, భిక్షపతి, అయిలయ్య, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కోర్టును తరలించొద్దు



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

రామన్నపేట జూలై 29: రామన్నపేట మండలానికి మంజూరైన సీనియర్ సివిల్ కోర్టు (సబ్‌కోర్టు)ను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఉద్యమం తప్పదని అఖిలపక్ష పార్టీల నాయకులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, సీపీఐ ఆధ్వర్యంలో రామన్నపేటకు మంజూరైన సబ్ కోర్టును వెంటనే ప్రారంభించాలని, చౌటుప్పల్‌కు తరలించాలని ఆలోచనను విరమించుకోవాలనే డిమాండ్‌తో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా అనేక మంది ప్రజలకు జూనియర్ సివిల్ కోర్టు సేవలందించిందని, కేసులు పెరగడంతో ప్రభుత్వం, అధికారులు జివో 50 ప్రకారం రామన్నపేటకు సీనియర్ సివిల్ కోర్టు (సబ్‌కోర్టు) ఏర్పాటుకు రూ.ఐదు కోట్లు మంజూరు జేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకోసం రెవెన్యూశాఖ ఐదు ఎకరాల భూమిని కూడా సేకరించిందన్నారు. కానీ మంజూరైన కోర్టును తరలించే చర్య చేస్తే రామన్నపేట మండలం ప్రాంతం నష్టపోతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కోర్టును ప్రారంభించాలని, లేని పక్షంలో అఖిపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అఖిపక్ష నాయకులు మేక అశోక్‌రెడ్డి, ఎండి జమీరోద్దీన్, పోచబోయిన మల్లేశం, పల్లపు దుర్గయ్య, సమ్మయ్య, ఫజల్, జెల్లల పెంటయ్య, అశోక్, రాములు, మల్లికార్జున్, వెంకటేశం, నరేందర్, లక్ష్మణ్, హనుమంత్, శ్రీనివాస్, జగతయ్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో జరిగే దీక్షను విజయవంతం చేయాలి

మోటకొండూరు/ మోత్కూరు, జూలై 29: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం ఆగస్టు6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న దీక్షను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల మంగపతి, జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఛలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు కొండమడుగు వీరనర్సయ్య మందుల పరుశరాములు, మైసయ్య, కృష్ణ, రాజు, సంపత్, నరేష్, రాజు పాల్గొన్నారు.



మోటకొండూర్‌లో కరపత్రం విడుదల చేస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

● మోత్కూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో జిల్లా ఉపాధ్యక్షుడు కొంపల్లి భాస్కర్, టౌన్ అధ్యక్షుడు బందెల శ్రీను ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదిగ యువసేన మండల అధ్యక్షడు కూరెళ్ల చిన్న ఉన్నారు.

చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టులో..

పర్మినెంట్ ఏపీపీ, ఏజీపీ పోస్టులు లేక ఇక్కట్లు

చౌటుప్పల్ టౌన్, జూలై 29: చౌటుప్పల్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో పర్మినెంట్ గా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ), అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) లు లేకపోవడంతో కక్షిదారులు తీవ్ర ఇబ్బందులకు గురి కావలసి వస్తుంది. రామన్నపేట కోర్టుకు చెందిన ఏపీపీ, ఏజీపీ లు చౌటుప్పల్ కోర్టుకు ఇంచార్జ్‌లు గా వ్యవహరిస్తు కక్షిదారుల కు బెయిలు ఇవ్వడంలో జాప్యం జరుగుతుంది. చౌటుప్పల్ పట్టణంలో లో జూనియర్ సివిల్ కోర్టు ను 16 సెప్టెంబరు 2021 న ప్రారంభమైనప్పటి నుంచి రామన్నపేట కోర్టు ఏపీపీ, ఏజీపీ లే ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్నారు. చౌటుప్పల్ కోర్టులో ఏపీపీ సోమ ,మంగళ వారాల్లోనే కక్షిదారుల కేసులను వాదిస్తారు. క్రిమినల్ కేసుల్లో కక్షిదారులకు బెయిల్ ఇవ్వాలన్నా.... రన్నింగ్ క్రిమినల్ కేసుల విషయంలో ఏపీపీ ఖచ్చితంగా వాదించవలసి ఉంటుంది. ఈ కోర్టులో కేవలం సోమ ,మంగళ వారాల్లో మాత్రమే ఏపీపీ అందుబాటులో ఉండడంతో కక్షిదారులకు సకాలంలో బెయిల్ దొరకక జైళ్ల లోనే మగ్గవలసి పరిస్థితి నెలకొంటుందని న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు. ఇంచార్జ్ లతో కక్షిదారులకు బెయిల్ ఇవ్వడంలో కొంత జాప్యం జరుగుతుందన్న అభిప్రాయం న్యాయవాదుల్లో వ్యక్తమవుతుంది. చిన్న చిన్న కేసుల్లో ఏపీపీ లేకున్న కూడ బెయిల్ ఇచ్చే అధికారం జడ్జికి ఉంటుంది. సివిల్ కేసులను ఏజీపీ చూసుకుంటారు.

లీగల్ హేర్ సర్టిఫికెట్ కోసం..

మునిసిపాలిటీలకు చెందిన లీగల్ హేర్ సర్టిఫికెట్ (వారసత్వ ధ్రువీకరణ పత్రం) లు కూడ కోర్టు ద్వారానే పొందవలసి ఉంటుంది. ఈ సర్టిపికెట్‌ల ను పొందాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. ఇందుకు గాను నోస్టల్ వాల్యు ప్రకారం ప్రభుత్వానికి డబ్బులను బ్యాంక్ లో చెల్లించవలసి ఉంటుంది. గతంలో ఈ సర్టిపికెట్ లను తహసీల్దార్ జారీ చేసేవారు.

మూడు కోర్టుల కేసులు మార్పిడి

చౌటుప్పల్ లో 2021 సెప్టెంబరు 16 న జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు జరిగినప్పుడు మూడు కోర్టుల పరిధిలోని కేసులను ఇక్కడికి మార్పిడి చేశారు. నల్లగొండ కోర్టు పరిదిలోని సంస్థాన్ నారాయణపురం మండలం, భువనగిరి కోర్టు పరిదిలోని భూదాన్ పోచంపల్లి మండలం, రామన్నపేట కోర్టు పరిదిలోని చౌటుప్పల్ మండలానికి చెందిన కేసులను బదిలీ చేశారు. దీంతో చౌటుప్పల్ కోర్టులో 6 వేలకు పైగా పెండింగ్ కేసులు ఉన్నట్టు న్యాయవాదులు తెలిపారు.

పర్మినెంట్ పోస్టులు మంజూరుకు డిమాండ్

ఇంచార్జ్‌ల స్థానంలో ఏపీపీ, ఏజీపీ లకు పర్మినెంట్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాలన్న డిమాండ్ న్యాయవాదుల నుంచి వినిపిస్తోంది. కోర్టు కు ఏపీపీ వారానికి రెండు రోజులు మాత్రమే వస్తుండడంతో కక్షిదారుల వాదనలను వినిపించడంలో జాప్యం జరుగుతుంది. ఏజీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. కక్షిదారుల వాదనలలో నెలకొనే జాప్యాన్ని తొలగించేందుకు ఏపీపీ, ఏజీపీ లకు పర్మినెంట్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయవలసి ఉంది. ఈ పోస్టులను స్టేట్ డైరెక్టర్ అఫ్‌ప్రాసిక్యూషన్ క్రియేషన్ చేయవలసి ఉంటుంది. రామన్నపేట కోర్టులో రెండు ఏపీపీ పోస్టులు ఉన్నాయి. అందులో నుంచి ఒక పోస్టును చౌటుప్పల్ కోర్టుకు బదిలీ చేసి కక్షిదారులకు న్యాయం చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇన్‌చార్జ్‌లతో కక్షిదారులకు బెయిల్ ఇవ్వడంలో జాప్యం

బాల్యం వెంకటాచలపతి, మాజీ ప్రధాన కార్యదర్శి

చౌటుప్పల్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు లో ఏపీపీ , ఏజీపీలు ఇన్‌చార్జ్‌లుగా ఉండడంతో కక్షిదారుల బెయిల్ ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి బాల్యం వెంకటాచలపతి తెలిపారు. సకాలంలో కక్షిదారులకు బెయిల్ దొరకక పోవడంతో జైళ్లలోనే మగ్గవలసి వస్తుందని, ఇంచార్జ్ ఏపీపీ రెండు రోజులు మాత్రమే చౌటుప్పల్ కోర్టుకు వస్తారని ఆయన తెలిపారు. ఇంచార్జ్ ఏపీపీ ,ఏజీపీ ల స్థానంలో పర్మినెంట్ పోస్టలను ప్రభుత్వం మంజూరు చేసి కక్షిదారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్‌రెడ్డిని ఛాంబర్‌లో కలిసిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

భువనగిరి అర్బన్, జూలై 29: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శాసన సభలోని తన చాంబర్‌లో సోమవారం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆగస్టు 15 తర్వాత మరోసారి కలిసి మాట్లాడుదామని సీఎం చెప్పారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్ తెలిపారు. సీఎంను కలిసిన వారిలో మాజీ మంత్రులు రాజేశంగౌడ్, నేరెళ్ల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణగౌడ్, సంజీవరావు, శ్రీధర్, నారాయణరావు పాల్గొన్నారు.

సినారెకు ఘన నివాళి



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాభారతి సాహితీ సంస్థ సభ్యులు

మోత్కూరు, జూలై 29: తెలంగాణ సాహిత్యాన్ని ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లిన ఘనత జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డికే దక్కిందని ప్రజా భారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు అన్నారు. సోమవారం డాక్టర్ సినారే జయంతి సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి గుమిడెల్లి వెంకన్న, కోశాధికారి గాదె వెంకటేశ్వర్లు, ప్రతినిధులు మర్రి జయశ్రీ, రాంప్రసాద్, ఉప్పలయ్య, బోళ్ల హనుమంతు, గ్రంథలయ మాజీ చైర్మన్ కోమాటీ మత్యగిరి, బయ్యని రాజు, కూరెళ్ల యాకస్వామి, రాజేశ్వరి, బాబుచారి ఉన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు వీరారెడ్డి

సంస్థాన్‌నారాయణపురం, జూలై 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి డిమాండ్ చేశారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో సోమవారం బీజేపీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రైతు డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్లను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ప్రతీ మహిళకు రూ.2500 ఇస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని ఆయన విమర్శించారు. హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిచో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురివి రాజుగౌడ్, నాయకులు బచ్చనబోయిన దేవేందర్, భాస్కర్, నరసింహ, వంగరి రఘు, నందగిరి జగత్, కుకుడాల మహేందర్‌రెడ్డి, ఆరుట్ల వెంకటేష్, సుర్వి వెంకటేష్, బీరప్ప పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి రూరల్, జూలై 29: భువనగిరి మునిసిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. 'మన వార్డుకు మన చైర్మన్, 'డయల్ యువర్ చైర్మన్' కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల మేరకు 28, 30 , 15వ వార్డుల్లో సోమవారం పర్యటించి సీసీరోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నజియారెహమాన్, ఖైరంకొండ వెంకటేశ్, ఎండి ఖాజాఅజిమొద్దిన్, నాయకులు ఎండి.సలావుద్దిన్, పొలిశెట్టి అనిల్‌కుమార్, సాయికిరణ్, రాజు, శెట్టి బాలయ్య న్నారు.

పేదలకు వైద్యం అందించడం ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ, నాయకులు

వలిగొండ, జూలై 29: పేదలకు వైద్య సహాయం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పలువురు అన్నారు. మండలంలోని ఎదుల్లగూడెం గ్రామానికి చెందిన పలువురి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఏనుగు ప్రదీప్‌రెడ్డికి రూ.20వేలు, గుమ్మడి అండాలుకు రూ.21వేలు, గూడూరు పాండురెడ్డికి రూ.22500, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి రూ.60వేలు, గుమ్మడి యాదిరెడ్డికి రూ.21వేలు, నోముల అనిల్‌రెడ్డికి రూ.15,500, ఎడబోయిన నిరంజన్‌కు రూ.60వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తాజామాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, మధు, జాన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రవి, వెంకటేశం పాల్గొన్నారు.

డయల్ 100పై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వలిగొండ, జూలై 29: మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో డయల్ 100పై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళా పోలీసులతో పెట్రోలింగ్ నిర్వహిస్తూ విజబుల్ పోలిసింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.